

## మధురవాడలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-మధురవాడ : తేదీ 12.06.2025 గురు వారం ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు పీ ఎమ్ పాలెం సెక్షన్‌లోని వైఎస్ఆర్ స్టేడియం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధి లో గల 11కేవి మిథిలాపురి ఫీడర్ పై మరమ్మత్తుల కొరకు ఈ క్రింది పేర్కొన్న ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుఃదని విద్యుత్ జోన్111 మధురవాడ ఆపరేషన్, ఇ. ఇ. పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు : మధురవాడ రెవెన్యూ లేఔట్, వెంకటేశ్వర స్వామి ఆలయం దరి ఏన్, టీ. ఆర్. బ్లాక్, తారక రామ నగర్, సూర్యశక్తినగర్, యం.వి.వి.రోడ్ తదితర ప్రాంతాలు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు గమనించి తమతో సహకరించవలసిందిగా ఆయన తన ప్రకటనలో కోరారు.

# యోగాంధ్ర కార్యక్రమంలో ఏయూ కీలక బాధ్యత

**- 1200 మంది ట్రైనర్స్‌కు శిక్షణ అందిస్తున్నాం**

**- ఏయూ ఉద్యోగులకు మూడు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభం**

**విశాలాంధ్ర-విశాఖపట్నం** : విశాఖ వేదికగా ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక బాధ్యతలను పోషిస్తోందని ఏ.యు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్డు యోగ విలేజ్ లో ఏయూ ఉద్యోగులకు మూడు రోజుల యోగ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ 1200 మంది ట్రైనర్స్ ను తీర్చిదిద్దే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అనుబంధ కళాశాలలో వెయ్యి మంది ట్రైనర్స్ ని తయారు చేశామని, రానున్న రోజుల్లో మరికొంత మందిని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 30 వేల మంది ఏకకాలంలో యోగ సాధన చేయడానికి అవసరమైన ఏర్పాట్లను ఏయూ మైదానాలలో ప్రభుత్వం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవం అనంతరం కూడా ప్రజలందరూ యోగాను సాధన చేసే విధంగా ఒక ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఏ.యూ ఉద్యోగులు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న బీచ్ రోడ్డు వేదికగా జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ నరసింహారావు, యోగ విభాగాధిపతి కె.రమేష్ బాబు, క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు. యోగ సాధన కార్యక్రమంలో భాగంగా ముందుగా సూక్ష్మ వ్యాయామం, వక్రాసనం, వజ్రాసనం, వృక్షాసనం, అర్ధహల ఆసనం, పవన ముక్తాసనం, సేతు బందాసనం, భుజంగాసనం, శలభాసనం, అనులోమ విలోమ ప్రాణాయామం, కపాల బాతిక్రియ, శీతలి, భ్రామరి ప్రాణాయామం, ధ్యానం వంటివి ఏ.యూ ఉద్యోగులు, విద్యార్థులతో చేయించారు.

## 1008 నారికేళ జలాలతో శ్రీనివాసునికి అభిషేకం

**విశాలాంధ్ర-పెందుర్తి** : ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రి పై బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తి ప్రపత్తులతో జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు 27 నక్షత్రాలను, 27 కలశాలల్లోకి ఆవాహన చేసి, 1008 కొబ్బరి బోండాల నీటితో, స్వామి వారికి అఖండ నారికేళ అభిషేకం నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులందరితోను వారి నక్షత్రాలకు తగ్గట్టుగా, కలశాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని వేలాది మంది భక్తులు వెంకటేశ్వర స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు.

## 13న విశాఖలో రెన్యూబుల్ ఎనర్జీ వర్క్‌షాప్...

**హాజరు కానున్న సీఎం చంద్రబాబు**

**విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం** : మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ వారి ఆధ్వర్యంలో జూన్ 13న నిర్వహించనున్న సౌత్ జోన్ రీజనల్ వర్క్ షాప్‌కు విశాఖపట్నం వేదిక కానుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ సమావేశానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద వెంకటేష్ జోషి, తెలంగాణ, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, ఎంఎన్ఆర్ఈ మరియు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతినిధులు, నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పాల్గొనున్నారు. మన రాష్ట్రం తరపున విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, నెడ్ క్యాప్ విసి & ఎండి ఎం కమలాకర్ బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఎస్ పీడీసీఎల్ సీఎండి కె సంతోషరావు, ఏపీసీపీడీసీఎల్ సీఎండి పి పుల్లారెడ్డి, తదితరులు పాల్గొనున్నారు. ఈ వర్క్ షాప్ లో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి ప్రభుత్వ పథకాల అమలు తీరు, విండ్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, హైడ్రో పవర్ ఎనర్జీ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ఆవశ్యకతపైనా ప్రధానంగా చర్చించనున్నారు. శుక్రవారం విశాఖపట్నం నోవాటెల్ హొటల్‌లో జరగనున్న ఈ వర్క్ షాప్ నిర్వహణ బాధ్యత రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చూడనుంది.

## విద్యుత్ అంతరాయం

**విశాలాంధ్ర-అనందపురం** : ఆనందపురం సబ్ స్టేషన్ నందు 11కెవి గంభీరం ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం 13న శుక్రవారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి నిలిపివేయబడుతుందని ఎలక్ట్రికల్ ఏఈ మండల. అప్పలనాయుడు తెలిపారు. ఈ కారణంగా మండలంలో ఈగలవానిపాలెం, పాలవలస మెట్టమీద వానిపాలెం, గుడిలోవ తదితర ప్రాంతాలకు గృహ, వ్యవసాయ, పారిశ్రమాక వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగునని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

# ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలను విలీనం చేయవద్దు

**ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావుకు వినతి**

**విశాలాంధ్ర-పద్మనాభం** : పద్మనాభం మండలంలో పద్మనాభం పంచాయతీ పరిధి ఇసకలపాలెం గ్రామ పాఠశాల ఎస్ఎంసి స్కూల్ కమిటీ చైర్మన్ హంస జ్యోతి,వైస్ చైర్మన్ భారతి,సభ్యులు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, డీఈఓ కు,స్థానిక ఎంఈఓ కు వినతి పత్రం అందించడం జరిగినది. వివరాలు ఇలా ఉన్నాయి. పద్మనాభం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసకలపాలెం గ్రామంలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను సుమారు 50ఏళ్ల క్రితం నుండి నిర్వహిస్తున్నారు. సదరు పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి వరకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన నిబంధనల ప్రకారం మాపాఠశాలలోని 3,4,5 తరగతులను పద్మనాభం మండల పరిషత్తు పాఠశాలలో విలీనం చేయదానికి అధికారులు నిర్ణయించారు. మాగ్రామం నుండి 3,4,5 తరగతుల విద్యార్థులు పద్మనాభం మండల పరిషత్తు పాఠశాలకు రావాలంటే సుమారు కిలో మీటరు దూరం నడచి రావడం తో పాటు పద్మనాభం లో ఉన్న రాష్ట్ర రహదారిని దాటి వెళ్ళాలి. ఈ రహదారి మీదుగా నిత్యం అనేక భారీ వాహనాలు, క్వారీ, ఇటుక రవాణా లారీలు, బస్సులు, ఆటోలు నిరంతరం తిరుగుతాయి. ఈకారణంగా చిన్నారులైన విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. విద్యార్థులు కిలో మీటరు దూరం బ్యాగుల బరువుతో రావడానికి కూడా చాలా ఇబ్బందులు పడతారు. కావున శ్రీవారు మాయందు దయచేసి మా ఇసకలపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల 3,4,5 తరగతులు పద్మనాభం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల లో విలీనం చేయకుండా ఆపాలని, మా పాఠశాల లో 1 నుండి 5వ తరగతి వరకు తరగతులు కొనసాగించి మా విద్యార్థుల సమస్య ను తీర్చాలని మిక్కిలి వినయపూర్వకంగా ప్రార్థిస్తున్నాము.

# సాగర్ నగర్-ఎండాడ రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గంటా పరిశీలన

**విశాలాంధ్ర-సాగర్ నగర్** : బి సాగర్ నగర్ సన్ క్యాంపస్ నుంచి ఎండాడ మెయిన్ రోడ్డు వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సీసీపీ ప్రభాకర్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మిలతో కలిసి రోడ్డు పనుల ప్రగతిని బుధవారం ఆయన పరిశీలించారు. సాగర్ నగర్ నుంచి రుషికొండ వరకు బీచ్ రోడ్డు పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించే 1.9 కిలో మీటర్ల పొడవున ఇంటర్ కనెక్టింగ్ రోడ్డును 60 అడుగులకు విస్తరించడానికి రూ.7 కోట్లు ఖర్చు చేయనున్నారు. నాలుగు ప్యాకేజీలుగా నిర్మించనున్న రోడ్డు విస్తరణకు మధ్యలో ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని సేకరించనున్నారు. సాగర్ నగర్ సన్ క్యాంపస్ దగ్గర సేకరించాల్సిన భూమి గురించి అక్కడే ఉన్న ఇద్దరు స్థల యజమానులతో గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. నష్టపోయే స్థలానికి నిబంధనల ప్రకారం త్వరితగతిన టీడీఆర్ లు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అభివృద్ధి కోసం స్థల సేకరణ అనివార్యమని, ఎవరినీ ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం లేదన్నారు. రోడ్డు విస్తరణ వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. రాడిసన్ బ్లూ ఎదురు రోడ్డు నుంచి ఎండాడ మెయిన్ రోడ్డు వరకు ప్రతిపాదించిన వి.ఎం.ఆర్.డి.ఎ. మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా గంటా పరిశీలించారు. జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, సారిపల్లి శ్రీనివాస్, మంగాదేవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొరియాలో 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న శ్రీ సత్యసాయి విద్యా విహార్ విద్యార్థి

**విశాలాంధ్ర-విశాఖ సిటీ** : శ్రీ సత్యసాయి విద్యా విహార్, విశాఖపట్నం తొమ్మిదవ తరగతి విద్యార్థి మాస్టర్ సబ్బవరపు శంకర, రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని జోచియన్ సిటీ ప్రభుత్వము మరియు కొరియా రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ సంయుక్తంగా జూలై 20 నుండి 30, 2025 వరకు నిర్వహించనున్న 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో పాల్గొనుటకు ఎంపికయ్యారనీ సత్యసాయి విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుండి ఇప్పటివరకు తన అంకితభావం, ప్రతిభతో మాస్టర్ సబ్బవరపు శంకర జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో 34 బంగారు, 21 వెండి, 8 కాంస్య పతకాలను సాధించాడు. 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో పాల్గొనుటకు ప్రతిష్టాకరమైన ఎంపిక సందర్భంగా, శ్రీ సత్యసాయి విద్యా విహార్ కన్వీనర్ ఎస్.జి.చలం, ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది మాస్టర్ సబ్బవరపు శంకరను హృదయ పూర్వకంగా అభినందించి, క్రీడా రంగంలో అతనికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. భారత దేశానికి మరిన్ని విజయాలను తీసుకురావాలని శంకర సిద్ధమవుతున్న ఈ సమయంలో, పాఠశాల యావత్ సిబ్బంది అతనికి సంపూర్ణ మద్దతు తెలిపింది.

## గీతం అడ్మిషన్‌ల సమాచారం

**విశాలాంధ్ర-మధురవాడ** : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మసీ (బి.ఫార్మసీ, ఎమ్.ఫార్మసీ), ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్, ఎమ్.ఆర్క్), మేనేజ్‌మెంట్ (ఎంబిఎ, బిబిఎ, బికామ్), సైన్స్ (ఎమ్మెస్సీ, బిఎస్సీ, ఎమ్‌సిఎ, బిసిఎ), లా కోర్సులు, హ్యుమానిటీస్, నర్సింగ్, ఫిజియోథెరిపి పారామెడికల్ కోర్సులలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకుగాను జాతీయ స్థాయిలో ఈనెల 22న ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలను (గ్యాట్-2025) నిర్వహించనున్నది.

**ఇంటర్ విద్యార్థులకు సైన్స్ డిగ్రీ కోర్సులు** : ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సులతో పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు అడ్మిషన్ల డైరక్టర్ తెలిపారు. అలాగే 3 సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**పారా మెడికల్ కోర్సులు** : వైద్య ఆరోగ్య రంగంలో పెరుగుతున్న ఉపాది అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రాంగణంలో బిఎస్సీ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, బిఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియోథెరిపి, నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

**కామర్స్ మరియు మేనేజ్‌మెంట్ కోర్సులు** : మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఆసక్తి గల విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఎ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఎ (ఫైనాన్సియల్ మార్కెట్స్), జనరల్ బిబిఎ కోర్సులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సుతోపాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మరియు అకాడమి ఆఫ్ హస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఎ హస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2025)ను దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. దీనికి సంబంధించి గ్యాట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోదలచిన వారు పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను పరిశీలించవచ్చునన్నారు. ఈకోర్సులలో ప్రవేశానికి జూన్ 19వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలన

**విశాలాంధ్ర-విశాఖ** : ఈ నెల 13వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. నోవోటెల్, వీఎంఆర్డీఏ డెక్ భవనం, వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీసీపీ అజిత ఇతర అధికారులతో కలిసి బుధవారం సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. ప్రాథమిక సమాచారం మేరకు ఆ రోజు ఉదయం మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ (%వీబీ=జు%) ఆధ్వర్యంలో నోవాటెల్ హొటల్లో రెన్యువబుల్ ఎనర్జీ వర్క్ షాప్ జరగనుండగా, మధ్యాహ్నం అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరగనుంది. అనంతరం వీఎంఆర్డీఏ పరిధిలో నూతనంగా నిర్మించిన డెక్ భవనం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. అక్కడే కొన్ని పారిశ్రామిక సంస్థలు, ఐటీ సంస్థలతో ఒప్పందాలు (ఎంఓయూ) జరగనున్నాయి. తదుపరి వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాకు చేరుకొని వివిధ పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానున్న వేదికలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## 13 నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు...

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం** : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విశాఖపట్నం జోన్-2, బొబ్బిలి, జగ్గంపేట డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం సర్కిల్ జోన్-2 డివిజన్ (పెదగంట్యాడ సెక్షన్, తేది.13.06.2025), విజయనగరం సర్కిల్ బొబ్బిలి డివిజన్ (మెంటాడ సెక్షన్, తేది 17.06.2025), కాకినాడ సర్కిల్ జగ్గంపేట డివిజన్ (హంసవరం సెక్షన్, తేది 19.06.2025) కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను చైర్‌పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు. ఈసదస్సుల్లో చైర్ పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు బి.సులేఖరాణి, ఎస్ సుబ్బారావు, ఎన్ మురళీకృష్ణ పాల్గొంటారు.

## పిల్లల వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించండి

**చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం**

**విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం** : కెజిహెచ్ లో పిల్లల వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం కన్వీనర్ గొండు సీతారాం కోరారు. కెజిహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఐ.వాణిని ఆమె ఛాంబర్ లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించి,శాలువాతో సత్కరించారు. అనంతరం ఆసుపత్రిలో బాలల హక్కుల పరిరక్షణతో ముడిపడివున్న వివిధ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు, ఆసుపత్రిలో పుట్టిన వెంటనే పిల్లల జన్మదిన ధృవీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేస్తున్నప్పటికీ మరింత వేగవంతం చేయాల్సిన ఆవశ్యకతపై ప్రణాళికతో దృష్టిని సారించాలని అన్నారు,ఉత్తరాంధ్ర ప్రదాయినిగా విలసిల్లుతున్న ఈ ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో పిల్లల వైద్యం కోసం ప్రత్యేక బెడ్లు,వైద్యులు, సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ప్రసూతి వార్డులో అనధికార దత్తతలపై అవగాహన పెంపొందించేలా వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను అతికించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ వాణి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం తన దృష్టికి తెచ్చిన విధంగా తమ ఆసుపత్రి ప్రాంగణంలో బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యతను కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం ప్రతినిధి కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ పల్లా సింహచలంకు ఉక్కు నిర్వాసిత నాయకుల ఘన నివాళి

**విశాలాంధ్ర-పెదగంట్యాడ** : ఉక్కు నిర్వశిత నాయకులు, తెలుగుదేశం దేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు మాజీ శాసన సభ్యులు పల్లా సింహాచలం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. ఉక్కు నిర్వశిత సంఘం కన్వీనర్ గోందేశీ సత్యరావు అధ్యక్షతన పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో బుధవారం సంస్మరణ కార్యక్రమంలో నిర్వశిత నాయకులు, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పాల్గోన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతు కార్మిక సంఘం నాయకునిగా, మాజీ శాసన సభ్యులుగా ఈ ప్రాంతం ప్రజలకు స్వర్గీయ పల్లా సింహచలం చేసిన సేవలను కొనియాడారు, ముఖ్యంగా ఉక్కు నిర్వశితుల ఉపాధికై అయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, మంత్రి గోపి నారాయణ, మంత్రి శంకరనారాయణ, నమ్మి అప్పారావు నమ్మి అప్పలనాయుడు, కణితి అప్పలరాజు, వంశీ కృష్ణ, కాకినాడ పెంట రావు, దానయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెద నరవలో అంగరంగ వైభవంగా శ్రీపైడిమాంబ పండగ

**విశాలాంధ్ర-పెందుర్తి** : జీవీఎంసీ 88 వ వార్డు పరిధిలోని పెద నరవ గ్రామంలో శ్రీ పైడిమాంబ పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 88 వార్డు జనసేన అధ్యక్షులు వబ్బిన జనార్ధన శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంస్కృతిక జానపద గీతాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ను శ్రీకాంత్ తదితర జనసేన నాయకులు కార్యకర్తలు సాలువాతో సత్కరించారు. పండుగ కార్యక్రమానికి అన్ని విధాలుగా సహకరించిన ప్రజలకు, ఉత్సవ కమిటీకి శ్రీకాంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పల్లా శ్రీనివాసరావుని పరామర్శించిన పరిమి భువనేశ్వరి

**విశాలాంధ్ర-తగరపువలస** : ఇటీవలె మరణించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు తండ్రి, విశాఖ-2 మాజీ ఎమ్మెల్యే శ్రీ పల్లా సింహాచలం చిత్రపటానికి జీవీఎంసీ 1వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి శ్రద్ధాంజలి ప్రకటించారు.పల్లా శ్రీనివాసరావు కుటుంబానికి ధైర్యం చెప్పి క్షేమంగా ఉండాలని కోరారు.

## 18 మంది మందుబాబులకు జరిమానా

**విశాలాంధ్ర-పెందుర్తి** : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరాజు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 1.67 లక్షల రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## వైభవోపేతంగా 3వ విడత చందన సమర్పణ

**విశాలాంధ్ర-సింహాచలం** : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారికి జేష్ఠ పౌర్ణమి సందర్భంగా మూడో విడత చందన సమర్పణ వైభవంగా జరిగింది. బుధవారం జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారుజామున అర్చకులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఇప్పటికే సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125 కిలోల) పచ్చి చందనంలో అర్చక స్వాములు పలు రకాల సుగంధ ద్రవ్యాలు కలిపి సమర్పణ పెరుమాళ్ (సింహాద్రి నాధునికి) చేశారు. అదేవిధంగా ఈ పవిత్రమైన రోజున కృష్ణాపురం గోశాలలో ఈఓ త్రినాధరావు నాదు నాగలి పట్టి పొలం దుక్కి దున్నడం ప్రారంభించారు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు రైతులందరు తమ పొలాల్లో భూమి పూజలు చేస్తారు. అనాది కాలం నుండి వస్తున్న ఆచారం. ఈ సమయంలో తమ పొలాల్లో ఎద్దులు నాగలితో దుక్కి దున్నడాన్నీ 'ఏరువాక' అంటారు. ఏరు అంటే ఎద్దులను కట్టి దున్నడానికి ఆరంభమని చెబుతారు.

## దేవాదాయ శాఖ ఉత్తర్వులు ప్రకారం మిగిలినవారి బదిలీల సంగతి ఏమిటి..?

**విశాలాంధ్ర-సింహాచలం:** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి దేవస్థానానికి చెందిన పలువురు ఉద్యోగులు వివిధ దేవాలయాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యనిర్వాహక ఇంజనీరు బండారు రాంబాబు విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి, డిప్యూటీ ఈఈ డీవీఎన్ రామరాజు (హరి)ను నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి బదిలీ చేశారు. పర్యవేక్షణాధికారి సునీల్ కు అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ బి.అనురాధ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి, డి.వెంకట రమణను అరసవల్లికి, జూనియర్ అసిస్టెంట్లు ఎన్. కార్తీక్ కు కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి, బాల భాస్కర్ ని అరసవల్లికి బదిలీ చేశారు. అయితే దేవస్థానం అధికారులు నివేదిక ప్రకారం సుమారు 20 మంది బదిలీ కావాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే బదిలీ కావడం పట్ల స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

## జూన్ 16న 4వ జోన్‌లో బహిరంగ వేలం నిర్వహణ

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం** : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 4 జోన్ లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం, ఒక మార్కెట్ మరియు మెయిన్ ఆఫీస్ కాంటీన్ నకు జూన్ 16వ తేది ఉ.గం.11.00 లకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని 4వ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జివిఎంసి 4వ జోన్ (సూర్యబాగ్) పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయము, జగదాంబ వాణిజ్య సముదాయము, పాత బస్ స్టాండ్ దుకాణములు, పద్మనగర్ వాణిజ్య సముదాయము, సూర్యబాగ్ వాణిజ్య సముదాయము, టి.ఎస్.ఆర్ వాణిజ్య సముదాయము, కనకలదిబ్బ వాణిజ్య సముదాయము లలోని మిగిలిన దుకాణాలకు మరియు జివిఎంసి మెయిన్ ఆఫీస్ కాంటీన్, అంబేద్కర్ కళ్యాణ మండపం, రెల్లివీధి రోడ్ సైడ్ షిప్ మార్కెట్లును 3 సంవత్సరముల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు 16-06-2025 తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు దరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళలో 4వ జోనల్ కార్యాలయం లోని పర్యవేక్షకును సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలిపారు.

## టిడిపి జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి జోగ నివాసంలో గంటా

**విశాలాంధ్ర-అనందపురం** : మండలంలో మామిడిలోవ గ్రామపంచాయతీలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మతల్లి పండగ సందర్భంగా తెలుగుదేశం పార్టీవిశాఖ జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి జోగ ముత్యాలు ఆహ్వానం మేరకు మంగళవారం సాయంత్రం జోగ నివాసానికి మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులతో కాసేపు మండల పరిధిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు రాకపట్ల ముత్యాలు నివాసంలో సందడి వాతావరణం నెలకొంది. శాసనసభ్యులతో పాటు మండల పార్టీ ప్రెసిడెంట్ కొత్రాజ్ అప్పారావు, బి ఆర్ బి నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, ఆబోతు అప్పల రాము, లోడగల వెంకట్రావు తదితరు నాయకులు పాల్గొన్నారు.